# యథాలాపం

పురాణం సుబ్రహ్మణ్యశర్మ

తెలుగు సాహిత్య చరిత్ర ఎవరైనా మన శతకాలతో ప్రారంభించి రాస్తే ఎలా వుంటుంది అని నాకో అయిడియా. తెలుగువారికి తప్ప మరోజాతికి శతకాల అదృష్టం లేదు. అసలు మనకు వున్నట్లు ఉత్పలమాల, చంపకమాల, శార్దూలం, మత్తేభంలాటి వృత్తాలు మరొకరికి ఏవి? చూడండి ఆటవెలది, గీతమాలిక, సీసమాలిక, ద్విపద, కందం అసి యిన్ని రకాల పద్య సంపద ఎవడికి ఏడిసింది? తెలుగు వాడి ఆస్తి తెలుగుపద్యం. ఈనాడు మన పిల్లలకి పద్యాలురావు అని గర్వించే స్థాయికి మమ్మీ డాడీలు ఎదుగుతున్నారు. హైదరాబాద్‌లో తెలుగులో మాట్లాడ్డానికి చాలామంది సిగ్గుపడి వచ్చీరాని ఉర్దూ హిందీ ఇంగ్లీషుల్లో సంభాషిస్తూ వుంటారు. నేను లండన్ వెళ్ళినప్పుడు అక్కడ లండన్ వీధుల్లో తెలుగుపద్యాలు చదివి రోడ్డును పునీతంచేశాము నేను, గూటాల కృష్ణమూర్తి గారూ, అన్నట్లు దసరా వచ్చింది కదూ! "అయ్యవార్లకు చాలు అయిదు వరహాలు, పిల్లవాండ్లకు చాలు పప్పుబెల్లాలు - జయాభి జయభవ -దిగ్విజయీభవ" అని యింటింటి ముందర దసరా పద్యాలు చదివి 'ధరసింహాసనమైన భంబు గొడుగైతద్దేవ తత్ భృత్స్యులై పరమామ్నాయము లెల్లనందిగణమై బ్రహ్మండ మాకారమై, విరించి గొడుగై శ్రీ గంగ సత్పుత్రియై ... వర్ధిల్లు నారాయణా!' అని చదివి పప్పుబెల్లాలు పుచ్చుకునేవాళ్ళం. అయ్యవారికి రెండు నుంచి నాలుగు రూపాయల వరకు గురు దక్షిణ చదివించి కొత్త పంచెలచాపు పెట్టేవారు యింటింటివద్ద, గిలకలు పట్టడం అని కూడా అనేవారు. ఇప్పుడు తెలుగు జీవితం నుంచి యీ సంప్రదాయాలు క్రమంగా అంతర్థానమయాయి.

చిన్నప్పుడు చాలామంది ఐదోక్లాసుతో చదువుకి స్వస్తి చెప్పి కులవృత్తులలోకి దిగేవారు. కొంతమంది ధర్మఫారం దాకా లాగించేవారు. యస్సెసెల్సీ దాకా చదివేవారు చాలా తక్కువ.

అక్షరాభ్యాసం అయాక - అక్షరాలు, గుణింతాలు, వత్తులు, పెద్దబాల శిక్ష కంఠతా పట్టించేవారు. సుమతీశతకం, కుమారశతకం ఆడపిల్లలకు, కృష్ణశతకం, దాశరథీ శతకం మగపిల్లలకు ఇవన్నీ నోటికి వచ్చేలా వల్లె వేయించేవారు. తరువాత పుస్తకం పట్టించడం ఒక మంచి కార్యక్రమం. శతకం వలన భాష, లోకజ్ఞానం కొండొకచో దైవభక్తి, మంచి ఉచ్ఛారణ, కాపీలు వ్రాయడం వలన మంచి దస్తూరి అలవడుతాయి. ఉపాధ్యాయులకు ఒకటీ రెండూ, మూడు, నాలుగు యిచ్చేవారు. పాలు, పెరుగు, కూరలు, పప్పులు, ధాన్యం ఊరికే భక్తితో యిచ్చేవారు. ఇప్పుడు యమ్మే చదువుతున్న వారికి కూడా పద్యం చదివి అర్థం చెప్పడం రాదు. పద్యాలు లవ్‌లెటర్స్‌లోలోపల. చదువుకోడానికి కాదు. సిరాబుడ్డి, పాళీకలం పుచ్చుగు సిరామీద ఒలక్కుండా స్కూళ్ళకు వెళ్ళేవాళ్లం. లెక్కలు, మిగతా రాతపని అంతా క్రింది తరగతుల్లో పెనసలుతోనే చేయాలి.

హిరణ్యకశిపుడు సైతం పోతనగారి భాగవతంలో 'పద్యం బొక్కటి చెప్పి దత్పార్యంబు భాషింపుమా' అని తెలుగు ప్రహ్లాదుడ్ని అడుగుతాడు. హిరణ్యకశిపుడుకి వున్న తెలుగుపద్యంమీద అభిమానం ఈనాడు తెలుగు వాళ్ళకి లేకపోయిందిగదా అని బాధ కలుగుతుంది.

వృత్తి విద్యలకు భాషా సంస్కృతిల పట్ల గల అభిమానానికి సగటు తెలుగుమనిషి కడు దూరం. తెలుగు శతకాల మీద దృష్టిలేని వారికి తెలుగు ప్రబంధాల గురించి ఏం తెలుస్తుంది? తెలుగు శతకాలలో భాస్కర శతకం నాకు చాలా అభిమానపాత్రమైనది. ఈ శతకం రాయని భాస్కరుని ఉద్దేశించి చెప్పినదని ఒక వాదన. ఈ శతకంలో సాధారణీకరణం ముందు ఉంటుంది. తరువాత మంచి ఉపమాలంకారం వుంటుంది. బంగారంలో ముత్యం తాపడంచేసి నట్లుగా అది అతికిపోతుంది.

తెలుగు శతకంలో పద్యాలు ఎన్ని వయ్యారాలు పోతాయో భాస్కర శతకం చూపిస్తుంది. ఇందులో అన్నీ ఉత్పలమాలలూ చంపకమాలలూను. డబ్బున్న శ్రీమంతుల దగ్గరకు ఎంతో కష్టపడి అనేకమంది తమంతట తాము వచ్చి ఆశ్రయిస్తారు. అన్ని నదులు సముద్రాన్ని చేరటం ఆయన రత్ననిలయుండని కదా అని పోలుస్తాడు చమత్కారంగా.

యాచకుల ఆశలు ఎరుగక వర్తించే లోభికి ధర్మదేవత యివ్వదు, అదెలాగంటే లేగ దూడలను తల్లివద్ద పాలు కుడువనీక పోతే ఆవులు తన్నాయికాని పాలు యిస్తాయా అని సాధారణ సామ్యాన్ని చెప్తాడు శతకకర్త.

సమయం సందర్భం చూసుకుని ఆదరంగా రాజు కోరితే ప్రజలు పదార్థాలను యిష్టంగా యిస్తారు. అలాగాక ప్రజలను కొట్టి వారినుండి పదార్థాలను గ్రహించమని రాజు కోరడం, ఎలా వుంటుందనగా, పాలు పొదుగును మొదలంటే వోస్తే రక్తంగాక మరేమి వస్తుంది? పాలు పిదికితే పొదుగునుంచి వస్తాయి.

మంచివాడు చెడ్డవానితో తిరిగితే పాట్లు, అవమానాలు తప్పవు. అది ఎలాగంటే యినుముతో కలియడం వలన అగ్నికి కూడా నమ్మెటపోటులు తప్పనట్లు లోకంలో జరుగుతాయి.

మంచి గుణాలచేత ప్రసిద్ధుడైన వాడు యిష్టుడైన తనచేత వలపించుకున్న వాడైతే కొంచెం యిచ్చినా మంచివాడు మేలు చేస్తాడు. అది ఎలాగున అంటే - కుచేలుడు తెచ్చిన అటుకులు స్వీకరించి శ్రీకృష్ణుడు తన చెలికానిక సమస్త భోగాలు సమకూర్చిన విధంగా జరుగుతుందని భావన. విభుండు అనగా పరిపాలించే రాజు నేర్పరియైనచో కొలిచేవారు అవగుణులైనప్పటికీ పనులన్నీ సవ్యంగా చక్కగా జరుగుతాయి. ప్రవిమల నీతిశవి అయిన రామ కార్యాన్ని సముద్రాన్ని దాటి కోతులు సాధించిన విధంగా జరుగుతాయి అని చమత్కారం.

ఎంత నేర్పరియైన మనిషిపట్లనైనా ఉపకార స్వభావము కల మనుష్యుడు లేకుండా మేలు చేకూరదు. ఎలా అంటే, పదారువన్నెల మేలిమి బంగారంలో కూడా వెలిగారం చేరకుండా అతకదుకదా (హత్తు గడగూడునె అని కవి వాక్యం) అని తాత్పర్యం.

ఈ క్షితిలో ఎప్పుడు అర్థకాంక్ష హృదయంలో

విడిచి పెట్టకుండా లోకులు సంరక్షకుడైన సత్ప్రభుని రాకలు గోరుతూ వుంటారు. అది ఎలాగంటే, వెన్నెలకోసం చంద్రోదయాన్ని కాంక్షిస్తూ చకోరాలు సంతోషంతో ఎదురు చూస్తాయి కదా అని భావం. మనుష్యుడు ఎంత మహాత్ముడైనా దైవం సరిగా చూడకపోతే దేశదిమ్మరి అయి సర్వం కోల్పోతాడు. ఎలాగంటే, రాజకుమారుడై కూడా శ్రీరాముడు కాలి నడకన అడవులన్నీ తిరిగి కాయలు, ఆకులు తినలేదా?

ఎంతటి కరుణ స్వభావం కలవాడయినా, సమయోచితంగా వాక్పరుషత చూపిస్తే కాని ఫలితం తథ్యంకాదు. మేఘం గర్జించిన తరువాతన వాన రాకుండా వుంటుందా? వస్తుంది గదా అని భావం.

గుణవంతుడైన వాడు యితరులు తనకు అపకారం చేసినా వారికి కీడు తలపెట్టడు. ఏ విధంగా అంటే, కవ్వంతో పెరుగును అంతా చిలికినా అది వెన్ననే యిస్తుంది కదా!

చాలా బలవంతుడినని విర్రవీగి యితర పతివ్రతా స్త్రీల సాంగత్యం (సురతం) కోరినట్లయితే, రాఘవుని చేత దశకంఠుడు సమూలంగా నాశనమైనట్లు నష్టపోతారు.

మంచివాడు ఊరికే ఒదిగి జీవిస్తూవున్నా దుష్టుడు నిష్కారణంగా ఓర్వలేక అపకారం చేయడం వాని విద్య. అది ఎలాగంటే, నూరు టంకాలు నిలువచేసే చీరనైనా చిరిగేట్లు చిమ్మెట కొరుకుతుంది. దానికేం లాభం?

ఎంతపాటు పడినా ప్రాప్తం లేకుండా వస్తువులు లభించవు. దేవతలతో కలిసి రాక్షసులు సముద్ర మథనం చేసినా అమృతం వారికవి దక్కలేదు కదా అని చమత్కారం!

చెడ్డవాడు ఎప్పుడూ అపకారమే చేస్తాడు గాని కొంచెం కూడా మేలు చేయడు. చీడపురుగు చెట్టును తింటుంది కాని పుడిసెడు నీళ్ళిచ్చి మొక్కను పెంచగలదా? లేదు అని భావం.

చెడ్డ మనిషి ఎన్నిరోజులు దొడ్డ వారితో కూడి వున్నా వాడి మంచి గుణాన్ని సంపాదించలేడు. తెడ్డుకూరలో తిరుగుతూ వున్నప్పటికీ రుచి నాలుకకి గాక మరి దేనికి తెలుస్తుంది? (నాలుకపని తెడ్డు ఎన్నిటికీ చెయ్యజాలదు)

అదృష్టం తాలూకు మహిమ సరిగా వుంటే అన్నీ యింపుగా సొంపుగా వుంటాయి. తరువాత బాగులేనపుడుదాని రూపం మారిపోతుంది. ఎలాగంటే, నిప్పునకు ప్రకాశం తగ్గినపుడు అది నల్లగా కట్టెబొగ్గుగా మారి పోతుంది కదా!

వాచవిగా కొన్ని పద్యాలు ఉదహరించాను. ఇవి పూర్వం రాసినవి గనుక వీటిలో ఆధునిక భావజాలానికి విరుద్ధంగా వున్న అంశాలు వుంటాయి. ఇందులోని లోకోక్తులు, చమత్కారాలు ఉదాహరణల్ని పాఠకులు గమనించాలి. సాహిత్యం పూర్వానిదైనా నవీనులదైనా రచయితలు కాగోరేవారు శ్రద్ధగా గమనించాలని నా మనవి. మంచిని ఎక్కడ నుంచైనా గ్రహించ గలగాలి.

